

ఆదాయంలో మేటి

కోహెడ వ్యవసాయ మార్కెట్ పురోగతి వైపు పరుగులు తీస్తుంది.

వివరాలు 8లో ▸



వ్యక్తి అనుమానాస్పద మృతి

అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు.

వివరాలు 8లో ▸



చిరుత.. భయం భయం

చిరుతలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.


వివరాలు 9లో ▸

హల్దీకి గోదారొచ్చింది

ప్రాజెక్టులోకి కాళేశ్వరం జలాలు

- మండుటెండల్లో పరవళ్లు తొక్కుతున్న చెక్‌డ్యాంలు
- 50 వేల ఎకరాలకు అందనున్న సాగునీరు
- అన్నదాతల్లో హర్షాతిరేకాలు

కాళేశ్వరం జలాలతో హల్దీ ప్రాజెక్టు పరవళ్లు తొక్కుతోంది. మండుటెండల్లోనూ చెక్‌డ్యాంలు జలకళతో ఉట్టిపడుతున్నాయి. ప్రాజెక్టు పరిధిలో సుమారు 50 వేల ఎకరాలు సస్యశ్యామలం కానున్నాయి. వేసవిలో సాగు నీటికి ఎలాంటి దిగులు లేదని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కాళేశ్వరం నీటితో నిండుకుండలా మారిన హల్దీ ప్రాజెక్టు

మెదక్‌జోన్: జిల్లాలోని తూప్రాన్, మాసాయిపేట, వెల్దుర్తి, చిన్నశంకరంపేట, కొల్చారం, మెదక్, హవేళిఘణాపూర్ మండలాల పరిధిలో సుమారు 60 కిలోమీటర్ల పొడవునా హల్దీ ప్రాజెక్టు పారుతుంది. దీనిపై గత ప్రభుత్వ హయాంలో 12 చెక్ డ్యాంలు నిర్మించారు. గోదావరి జలాలను కాళేశ్వరం నుంచి వయా కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ ద్వారా గత రెండేళ్లుగా హల్దీలోకి వదులుతున్నారు. దీంతో ప్రాజెక్టు పరిధిలో సుమారు 50 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. అలాగే ప్రాజెక్టు నుంచి ఎటూ మూడు కిలోమీటర్ల మేర భూగర్భజలాలు పెరిగి అడుగంటిన బోర్లలో సైతం నీరు పుష్కలంగా వస్తాయని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు.

ఏటా రెండు పంటలు..

కాళేశ్వరం నీటితో హల్దీ ప్రాజెక్టు నిండుకుండలా మారడంతో ఏడు మండలాల పరిధిలోని రైతులు ప్రాజెక్టులో మోటార్లు బిగించి 2 నుంచి 3 కిలోమీటర్ల పొడవునా పైపులైన్లు వేసుకున్నారు. ప్రస్తుతం బోరుబావి తవ్వాలంటే కనీసం రూ. 2 నుంచి రూ. 2.50 లక్షల ఖర్చు అవుతుంది. అదే కిలోమీటర్ మేర పైపులైన్ వేయాలంటే రూ. 50 వేలు మాత్రమే అవుతుండడంతో రైతులు దీనికే ప్రాధాన్యం ఇస్తున్నారు. వేసవిలో ఒక్కసారి కాళేశ్వరం జలాలు హల్దీలోకి వదిలితే వానాకాలం వచ్చే వరకు నీరు ఉంటుంది. దీంతో ప్రాజెక్టు పరిధిలోని ఏడు మండలాల రైతులు ఏటా రెండు పంటలు వరి సాగు చేపడుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఈ యాసంగిలో 2.90 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా.. ప్రాజెక్టు పరిధిలో 50 వేల ఎకరాలు సాగవుతున్నాయి.

ఎలాంటి దిగులు లేదు



కాళేశ్వరం జలాలతో హల్దీ ప్రాజెక్టును ఒక్కసారి నింపితే వేసవి ముగిసే వరకు పుష్కలంగా నీరు ఉంటుంది. ఇటీవలే నీటిని వదలడంతో పరవళ్లు తొక్కుతోంది. నాకు ప్రాజెక్టు పరిధిలో మూడెకరాల పొలం ఉంది. సాగు నీటికి ఎలాంటి ఢోకా లేదు.

– మర్కంటి కుమార్, రైతు, ఉప్పులింగాపూర్

వేలాది ఎకరాలు సస్యశ్యామలం



కాళేశ్వరం నీటితో హల్దీ ప్రాజెక్టు, దాని పరిధిలో నిర్మించిన చెక్‌డ్యాంలు నిండుకుండలా మారాయి. దీని పరిధిలోని 50 వేల ఎకరాలతో పాటు భూగర్భజలాలు పెరిగి మరో 30 వేల పైచిలుకు ఎకరాలు సస్యశ్యామలం అవుతాయి. ఏటా ఫిబ్రవరిలో నీటిని వదిలితే యాసంగి పంటలు చేతికందే వరకు నీరు సరిపోతుంది.

– శ్రీనివాస్‌రావు, ఈఈ ఇరిగేషన్, మెదక్

న్యూస్‌రీల్

పేట పోలీస్‌స్టేషన్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేట పోలీస్‌స్టేషన్‌ను మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా కేసులకు సంబంధించి పలు రికార్డులను పరిశీలించారు. నేరాలకు సంబంధించిన కేసులను త్వరగా పరిష్కరించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. దొంగతనాలు జరగకుండా పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ మహిపాల్

శివ్వంపేట(నర్సాపూర్): ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆర్డీఓ మహిపాల్ పరిశీలించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలకు సంబంధించి శివ్వంపేట ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న రెండు పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, నీటి వసతితో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. మండల వ్యాప్తంగా పట్టభద్రులు 571, ఉపాధ్యాయ ఓటర్లు 47 మంది ఉన్నారని చెప్పారు. ఆయనతో పాటు తహసీల్దార్ కమలాద్రి, ఉప తహసీల్దార్ షఫీయోద్దీన్ తదితరులు ఉన్నారు.

డంప్‌యార్డ్‌కు వ్యతిరేకంగా పోస్ట్‌కార్డు ఉద్యమం



పోస్టుకార్డు ఉద్యమంలో పాల్గొన్న నాయకులు

నర్సాపూర్ రూరల్: ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంప్‌యార్డుకు వ్యతిరేకంగా లోక్‌సత్తా ఉద్యమ సంస్థ జిల్లా కన్వీనర్ నాగేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం నర్సాపూర్ బస్టాండ్‌లో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు మల్లేష్, నాగరాజు, నర్సమ్మ, రైతు రక్షణ సమితి సభ్యుడు చంద్రశేఖర్ పాల్గొని సంతకాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దట్టమైన అటవీ ప్రాంతంలో డంప్‌యార్డ్ ఏర్పాటు చేస్తే పర్యావరణ కాలుష్యంతో పాటు నర్సాపూర్ రాయరావు చెరువు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. జంతువులు, మనుషులు రోగాల బారిన పడే అవకాశం ఉంటుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారులకు విన్నవించేందుకు పోస్టుకార్డు ఉద్యమం చేపడుతున్నట్లు తెలిపారు.

ఐటీఐఆర్‌కు జగ్గారెడ్డి అర్థం చెప్పాలి

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఎద్దేవా



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : రాష్ట్రానికి ఐటీఐఆర్ మంజూరు చేయాలన్న కాంగ్రెస్ నేత జగ్గారెడ్డికి అసలు ఐటీఐఆర్ అంటే అర్థం చెప్పాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఎద్దేవా చేశారు. ప్రధాని మన్మోహన్‌సింగ్ హయాంలో వచ్చిన ఐటీఐఆర్‌పై జగ్గారెడ్డికి కనీసం అవగాహన కూడా లేదన్నారు. కందిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సదాశివపేట మండలంలోని ఎమ్మారెఫ్ ఫ్యాక్టరీ యాజమాన్యం సుమారు 400 మంది కార్మికులను ఉన్నపళంగా ఉద్యోగాల్లోంచి తొలగించిందని, ఇదేమని ప్రశ్నిస్తున్న కార్మికులను పోలీసులతో దౌర్జన్యానికి పాల్పడుతోందన్నారు. జీతాలు పెంచాలని అడిగినందుకు వారి ఉద్యోగాలను తొలగించిందని, దీనిపై కార్మిక శాఖ అధికారులు కనీసం స్పందించడం లేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి దావోస్ పర్యటనల్లో రూ. వేల కోట్లు పెట్టుబడులు తెచ్చి పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తామని ప్రకటిస్తున్న రేవంత్ రాష్ట్రంలో ఉన్న పరిశ్రమల్లో ఉద్యోగాలను తొలగిస్తే కనీసం స్పందించకపోవడం శోచనీయమన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఫోన్, టీవీకి దూరంగా ఉండండి

కలెక్టర్ రాహుల్‌రాజ్

హవేళిఘణాపూర్(మెదక్): పరీక్షల వేళ విద్యార్థులు టీవీ, ఫోన్‌కు దూరంగా ఉండాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని బూర్గుపల్లి జెడ్పీ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్ష్యాన్ని ఎంచుకొని బాగా చదివి తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించి చదువుకునే విధంగా ప్రోత్సహించాలని అన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వందశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సందేహాలుంటే నివృత్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

రోడ్లపై కోతులకు ఆహారం వేయొద్దు

డీఎఫ్‌ఓ జోజి

నర్సాపూర్ రూరల్: రోడ్లపై కోతులకు ఆహారం వేయొద్దని డీఎఫ్‌ఓ జోజి జంతు ప్రేమికులకు సూచించారు. శుక్రవారం జిల్లా అటవీశాఖ, వూన్ హాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నర్సాపూర్ అర్బన్ పార్క్ ఆవరణలో ఏర్పాటు చేసిన కోతుల ఆహార సేకరణ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. వచ్చే వానాకాలంలో కోతుల ఆహారం కోసం 22 వేలకు పైగా పండ్ల మొక్కల పెంపకం చేపట్టనున్నట్లు తెలిపారు. రోడ్లపై కోతులకు ఆహారం వేసే వారంతా అర్బన్‌పార్క్ వద్ద ఏర్పాటు చేస్తున్న ఆహార సేకరణ కేంద్రంలో అందజేయాలని సూచించారు. రోడ్లు, జనావాసాలకు దూరంగా కోతులకు ఆహారం ఏర్పాటు చేసి మనుషులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నదే తమ లక్ష్యం అన్నారు. ఇక్కడ విజయవంతం అయితే మిగితా ప్రాంతాల్లో అమలు చేస్తామని పేర్కొన్నారు. ప్యారనగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంప్‌యార్డ్‌తో జంతువులకు ఇబ్బంది తలెత్తకుండా 12 మీటర్ల ఎత్తులో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. డంప్‌యార్డ్‌తో నర్సాపూర్ రాయరావు చెరువులోకి వచ్చే నీరు కలుషితమయే ప్రమాదం ఉందని విలేకరులు ప్రశ్నించగా.. ప్రభుత్వ ఆదేశాలతో కొనసాగుతున్నందున దానిపై ఏమి మాట్లాడలేమని బదులిచ్చారు. కార్యక్రమంలో వూన్ హాండ్స్ ఫౌండేషన్ డైరెక్టర్ పరమేశ్వరి, ఎఫ్ఆర్‌ఓ అరవింద్, సెక్షన్ ఆఫీసర్ సాయిరాం పాల్గొన్నారు.



కోతుల ఆహార సేకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎఫ్‌ఓ జోజి

ప్రజలకు భరోసా కల్పించండి

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



మెదక్ మున్సిపాలిటీ: ఎన్నో సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలకు మేమున్నామని భరోసా కల్పించాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నూతనంగా ఉద్యోగంలో చేరిన పోలీస్ సిబ్బందికి రెండు రోజులుగా శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోలీస్‌స్టేషన్‌కు వివిధ రకాల అభ్యర్థనలు, ఫిర్యాదులు, సమాచారం, సహాయం కోసం ప్రజలు వస్తుంటారని తెలిపారు. ప్రతి ఒక్కరిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించాలన్నారు. ప్రతి పౌరుడికి సమన్యాయం జరిగేటట్లు చూడాలన్నారు. ప్రజలకు సత్వర న్యాయం జరగడానికి సాంకేతిక వనరులు వినియోగించుకోవాలని చెప్పారు. విధుల్లో మంచి ప్రతిభ కనబరిచి ప్రజల మన్ననలు పొందాలన్నారు. ఆదేవిధంగా ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్లు మధుసూదన్‌గౌడ్, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి: ఎమ్మార్పీఎస్

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని విజయ డెయిరీలో జరిగిన రూ. 24 లక్షల స్కాంలో దళితుడిని బలిపశువు చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గత నెల 11వ తేదీన విజయ డెయిరీలో దుర్గాప్రసాద్‌తో పాటు అతడి తల్లిదండ్రులను చిత్రహింసలకు గురిచేశారని వాపోయారు. తమకు ఎలాంటి సంబంధం లేదని చెప్పినా మెదక్ టౌన్ పోలీసులు చిత్రహింసలు పెట్టి బలవంతంగా ఒప్పించారని తెలిపారు. పూర్తి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజ్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్, పద్మారావు, గట్టయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి జీవితంలో 'పది' కీలకం

డీఈఓ రాధాకిషన్

చిన్నశంకరంపేట(మెదక్): విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలక మలుపని డీఈఓ రాధాకిషన్ అన్నారు. శుక్రవారం మండలంలోని మడూర్, మిర్జాపల్లి జెడ్పీ పాఠశాలను తనిఖీ చేశారు. ఈసందర్భగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఉన్నత విద్యకు పదో తరగతి ఒక బేస్‌గా నిలుస్తుందన్నారు. ఇక్కడ పునాది పడితేనే ఇంటర్, డిగ్రీలో సునాయాసంగా గట్టెక్కగలుగుతారన్నారు. సబ్జెక్ట్‌పై పట్టు సాధించిన విద్యార్థులే మెరుగైన గ్రేడ్ సాధించగలరని తెలిపారు. మెరుగైన ఫలితాల కోసం 36 రోజులు ఏకాగ్రతతో కష్టపడి చదవాలన్నారు. ఉదయం, సాయంత్రం చదవగలిగేతేనే పాఠ్యాంశం మనసులో నిలిచిపోతుందని వివరించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం రవీందర్‌రెడ్డికి పలు సూచనలు చేశారు. అంతకుముందు మిర్జాపల్లి జెడ్పీ పాఠశాలను తనిఖీ చేశారు. కరాటేలో ప్రతిభ కనబర్చి గోల్డ్‌మోడల్ సాధించిన విద్యార్థి రేణుక, రజిత పతకం పొందిన కావ్య, అనూషను అభినందించారు. ఆయన వెంట ఏఎంఓ సుదర్శన్, ఎంఈఓ పుష్పవేణి ఉన్నారు.



కరాటేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ

కాంగ్రెస్‌లో అన్నివర్గాలకు సమన్యాయం

డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

రామాయంపేట(మెదక్): కాంగ్రెస్‌లో అన్నివర్గాలకు సమన్యాయం జరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకుడు సరాపు యాదగిరి, పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగరాజు, నాయకులు చింతల యాదగిరి, శ్యాంతో పాటు నిజాంపేట మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెదక్ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ కృషి చేస్తున్నారని కొనియాడారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మాట్లాడుతూ.. తాము పార్టీలకతీతంగా అభివృద్ధికి పాటు పడుతున్నామని అన్నారు. తనకు మెదక్ జిల్లా రాజకీయ భిక్ష పెట్టిందన్నారు. సొంత నిధులతో కార్యకర్తలను కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. అంతకుముందు పట్టణంలో నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాసరెడ్డి, పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రామచందర్‌గౌడ్, జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు యుగంధర్‌రావు, నిజాంపేట, హవేళీఘణాపూర్ మండలాల పార్టీ అధ్యక్షులు నసీరుద్దీన్, శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, నాయకులు అమరసేనారెడ్డి, అరుణ, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మైనంపల్లి హన్మంతరావు, పక్కన ఆంజనేయులుగౌడ్, నాయకులు

గుమ్మడిదలను మరో లగచర్ల చేయొద్దు

- డంప్‌యార్డ్ ఆలోచన ఉపసంహరించుకోండి
- మాజీ మంత్రి హరీశ్‌రావు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదలను మరో లగచర్ల చేయొద్దని, ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని డంప్‌యార్డ్ ఏర్పాటు ఆలోచనను విరమించుకోవాలని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వానికి సూచించారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని నల్లవల్లి గ్రామంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ప్రజాపాలన పేరుతో ఎమర్జెన్సీని తెచ్చారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పచ్చని పంట పొలాల మధ్య డంప్‌యార్డ్ చిచ్చు పెట్టిందని మండిపడ్డారు. ఈ సమస్యపై అసెంబ్లీ వేదికగా ఈ ప్రాంత ప్రజల తరఫున పోరాడుతామని హామీ ఇచ్చారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం అధికారులు వెంటనే పనులను నిలిపివేయాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సునీతారెడ్డి, చింతా ప్రభాకర్, మాణిక్‌రావు పాల్గొన్నారు.



నిరాహార దీక్షలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

అభాగ్యులకు 'వాత్సల్యం'

- జిల్లాలో 102 మందికి భరోసా
- కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ

అనాథ పిల్లలకు అండగా పథకం

మెదక్ కలెక్టరేట్: అనాథ పిల్లల సంరక్షణకు ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయి. మిషన్ వాత్సల్య పథకంతో భరోసా కల్పిస్తున్నాయి. ఎంతో మంది అభాగ్యులు తల్లి, తండ్రిని కోల్పోయి ఆవేదన చెందుతున్నారు. అయినవారు లేక, బంధువులు ఆదుకోక అవస్థలు పడుతున్నారు. అలాంటి పిల్లలకు ఉన్నత చదువులు చెప్పిస్తున్నారు. వారు ప్రయోజకులుగా ఎదిగేందుకు నెలకు రూ. 4 వేలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. 2022లో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టగా.. జిల్లాలో ప్రస్తుతం 102 మంది లబ్ధిపొందుతున్నారు. ప్రస్తుతం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

అర్హులు.. అర్హతలు

తల్లి లేదా తండ్రి, ఇద్దరిని కోల్పోయిన వారు, విడాకులు తీసుకున్న దంపతుల పిల్లలు, తల్లిదండ్రులు కోల్పోయి ఇతర కుటుంబాల్లో నివసిస్తున్న వారు, ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న వారి పిల్లలు, ఆర్థికంగా, శారీరకంగా బలహీనులై, తమ బిడ్డలను పెంచలేని, ప్రకృతి వైపరీత్యాల బాధితుల పిల్లలు, బాల కార్మికులు, బాల్యవివాహ బాధితులు, ఎయిడ్స్ బాధితుల పిల్లలు, అంగవైకల్యం, అక్రమ రవాణాకు గురైన వారు, ఇంటి నుంచి తప్పిపోయిన పిల్లలు, బాల యాచకులు, పీఎం కేర్ ఫర్ చిల్డ్రన్ పథకం మంజూరైన పిల్లలు, కోవిడ్-19తో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు పథకం పొందడానికి అర్హులు. గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకు రూ. 72 వేలు, పట్టణ ప్రాంతాల్లోని పిల్లల కుటుంబ వార్షికాదాయం రూ. 96 వేలకు మించి ఉండకూడదు. తప్పనిసరిగా ఆదాయ ధృవీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. ఈ పథకానికి కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు అందజేస్తుంది. దరఖాస్తులను కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. దరఖాస్తు సమయంలో విద్యార్థికి సంబంధించిన పలు ధృవీకరణ పత్రాలతో పాటు వ్యక్తిగత బ్యాంక్ అకౌంట్, సంరక్షకులతో కూడిన జాయింట్ అకౌంట్ వివరాలు అందజే



నెలకు రూ. 4 వేలు అందజేత

ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ. 4 వేల చొప్పున 18 ఏళ్ల వయసు వచ్చే వరకు భృతి అందజేస్తారు. పిల్లలు 30 రోజులకు మించి బడికి హాజరుకాకపోతే ఈ పథకం నిలిపివేస్తారు. అయితే ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల విషయంలో మాత్రం మినహాయింపు ఉంటుంది. అలాగే ఈ పథకానికి ఎంపికైన పిల్లలు భవిష్యత్‌లో ఏదైనా హాస్టల్‌లో చేరితే అప్పటి నుంచి ఈ పథకం నిలిపివేస్తారు.

నిరంతర ప్రక్రియ



మిషన్ వాత్సల్య పథకం దరఖాస్తులు నిరంతర ప్రక్రియ. జిల్లాలో 152 మంది వరకు లబ్ధి పొందే అవకాశం ఉంది. ప్రస్తుతం 102 మంది విద్యార్థులకు ఈ పథకం కింద భరోసా కల్పిస్తున్నాం. రెసిడెన్షియల్ హాస్టళ్లలో చేరినవారు, 18 ఏళ్లు నిండిన విద్యార్థులు ఈ పథకం నుంచి వెళ్లిపోతారు. ఆస్థానంలో కొత్త వారికి అవకాశం కల్పిస్తాం.

– కరుణశీల, జిల్లా బాలల సంరక్షణ అధికారిణి

క్లుప్తంగా

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : జడ్జి స్వాతిరెడ్డి

సిద్దిపేటరూరల్‌: విద్యార్థులు చిన్నతనం నుంచే రాజ్యాంగం ద్వారా పొందుపరిచిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సిద్దిపేట ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి అన్నారు. శుక్రవారం చిన్నగుండవెల్లి శివారులోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి స్వాతిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. పాఠశాల స్థాయి నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండడం ఎంతో మంచిదన్నారు. అంతకుముందు పాఠశాలను తిరుగుతూ సందర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగలత, ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

దౌల్తాబాద్ (దుబ్బాక): అక్రమంగా దాచి ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారి కథనం మేరకు.. మండల పరిధిలోని శేరిపల్లి గ్రామంలో బోడు భిక్షపతి అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా 6 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని దాచి ఉంచాడు. నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, దౌల్తాబాద్ పోలీసులు దాడి చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చిన్నారిపై వీధి కుక్కలు దాడి

పటాన్‌చెరు టౌన్: తెల్లాపూర్ మున్సిపాలిటీ ముత్తంగి గ్రామ పరిధిలోని న్యూ టౌన్ కాలనీలో ఐదేళ్ల చిన్నారిపై శుక్రవారం వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా కరిచాయి. వివరాల్లోకి వెళ్తే.. న్యూ టౌన్ కాలనీలో ఖమ్రుద్దీన్ అనే వ్యక్తి కుటుంబంతో ఉంటున్నాడు. సాయంత్రం సమయంలో అతడి ఐదేళ్ల కుమారుడు ఉస్మాన్ ఇంటి ఎదుట ఆడుకుంటుండగా ఐదు వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. అలాగే కుక్కలు లాక్కెళ్లేందుకు ప్రయత్నం చేశాయి. పిల్లవాడి అరుపులు విన్న స్థానికులు తక్షణం స్పందించి కుక్కలను తరిమారు. ఉస్మాన్‌ను వెంటనే ఆస్పత్రికి తరలించారు. న్యూ టౌన్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం ఎదుట, పల్లె ప్రకృతి వనంలో, నీటి ట్యాంక్ వద్ద పెద్ద గుంపుగా కుక్కలు ఉంటుందని కాలనీ వాసులు తెలిపారు.

అమరవీరులకు నివాళి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో శుక్రవారం అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ మాట్లాడుతూ...2019 ఫిబ్రవరి 14న కేంద్ర రిజర్వు బలగాలపై జైషే ఈ మహమ్మద్ అనే ఉగ్రవాద సంస్థ జరిపిన దాడిలో 40మంది జవాన్లు వీరమరణాన్ని పొందారన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో అతి శక్తివంతమైన సైనిక బలగాలను కలిగిన దేశాలలో భారత్ ఒకటని అన్నారు. కార్యక్రమంలో ఎన్సీసీ అధికారి డాక్టర్ విజయ, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సదయకుమార్, అధ్యాపకులు విజయ, సుచిత్రసింగ్, సుజాత, సరోజినీ, కొండయ్య, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కామరాజ్ , అధ్యాపక బృందం పాల్గొన్నారు.

తమ్ముడిని చంపిన అన్న

- డబ్బుల విషయంలో గొడవ
- బండరాయితో మోది హత్య

మునిపల్లి(అందోల్‌): ఆస్తి తగాదాల్లో తలెత్తిన వివాదంలో తమ్ముడిని అన్న హత్య చేశాడు. ఈ ఘటన మునిపల్లి మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. బుదేరా ఎస్ఐ రాజేశ్ నాయక్ కథనం మేరకు.. చిల్లపల్లి గ్రామానికి చెందిన గొల్ల యాదయ్య తన తమ్ముడైన గొల్ల శివయ్య (37)కు డబ్బులు ఇవ్వాల్సి ఉంది. డబ్బుల విషయంలో ఇద్దరి మధ్యమాట మాట పెరిగి తమ్ముడైన శివయ్యను యాదయ్య బండరాయితో మోది హత్య చేశాడు. ముగ్గురు అన్నాదమ్ముళ్ల మధ్య ఎకరా భూమిని పెద్దవాడైన యాదయ్య అమ్మాడు, అమ్మగా వచ్చిన డబ్బులను తన వాటాగా ఇవ్వాలని శివయ్య అడగడంతో దాడి చేసి హత్య చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సాంప్రదాయ పంటలకు స్వస్తి

పొగాకుపై ఆసక్తి

రైతులు సాంప్రదాయ పంటలకు బదులుగా వాణిజ్య పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. నంగునూరు మండలంలోని పలు గ్రామాల్లో వాణిజ్య పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ముఖ్యంగా పొగాకు పంటలను సాగు చేసి, మొక్కల నుంచి ఆకులను వేరి చేసి, ఎండలో ఎండబెట్టి, విక్రయానికి సిద్ధంగా ఉంచుతున్నారు.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట


నంగునూరు మండలంలో రైతులు సాగు చేస్తున్న పొగాకు తోటలు


పొగాకును ఎండబెట్టిన రైతులు

మార్కెట్ కమిటీ.. ఆదాయంలో మేటి


కోహెడ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

కోహెడ ఏఎంసీకి భారీ ఆదాయం
- తొమ్మిదేళ్లలో రూ.5.98 కోట్లు
- గోదాం, చెక్ పోస్టుల నుంచే ప్రధాన రాబడి
- పత్తి, ధాన్యం కొనుగోళ్లలో 1 శాతం వసూలు
- సిద్దిపేట మార్కెట్‌కు రూ.50 లక్షలు అప్పు
- మార్కెట్ అభివృద్ధికి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక కృషి

కోహెడ(హుస్నాబాద్‌): కోహెడ వ్యవసాయ మార్కెట్ పురోగతి వైపు పరుగులు తీస్తుంది. హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ నుంచి 2016లో విడిపోగా అప్పటి నుంచి సొంతంగా ఆర్థిక కార్యకలాపాలు నిర్వహిస్తోంది. కోహెడలో మార్కెట్ కార్యాలయం నిర్మాణానికి ప్రభుత్వం నుంచి మంజూరు వచ్చినప్పటికీ సరిపడా ప్రభుత్వ స్థలం లేకపోవడంతో వేంకటేశ్వర్లపల్లిలో కార్యాలయం నిర్మించారు.

తొమ్మిదేళ్లలో రూ.5.98 కోట్లు ఆదాయం

కోహెడ వ్యవసాయ మార్కెట్‌కు తొమ్మిదేళ్లలో రూ.5.98 కోట్ల ఆదాయం సమకూరింది. నాబార్డు సహకారంతో 2500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ఆధునిక వ్యవసాయ మార్కెట్ గోదాం నిర్మాణం చేశారు. గోదాంలో ధాన్యం నిల్వ చేసినందుకు ప్రభుత్వ సంస్థల నుంచి నెలకు రూ.43 వేలు, ప్రైవేటు వారి నుంచి నెలకు రూ.1.20 లక్షలు అద్దె వసూలు చేస్తుంది. బస్వాపూర్, కోహెడలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల ద్వారా ఫీజు వసూలు చేస్తుంది. మండలంలో ఐకేపీ, పీఏసీఎస్ ద్వారా కొనసాగుతున్న పత్తి, వరి ధాన్యం కొనుగోళ్లలో సివిల్ సప్లయ్ నుంచి మార్కెట్‌కు రూ.1 శాతం కమిషన్ జమ అవుతూ వస్తోంది. హుస్నాబాద్ మార్కెట్ నుంచి రూ.2 కోట్లు అప్పు తీసుకొని కోహెడ మండల కేంద్రంలో సమీకృత కూరగాయల, దుకాణ సముదాయ భవనం నిర్మాణం చేశారు. ఇందులో 21 గదులు ఉండగా అద్దె ద్వారా మార్కెట్‌కు ఆదాయం వస్తుంది. సిద్దిపేట మార్కెట్‌కు సైతం రూ.50 లక్షలు అప్పు అందించింది. ప్రతీయేటా 12.50 శాతం వడ్డీ రూపంలో కోహెడ మార్కెట్‌కు ఆదాయం జమ అవుతుంది.

తొమ్మిదేళ్ల ఆదాయ వివరాలు

సంవత్సరం	ఆదాయం (రూ.లలో)
2016-17	3,04,000
2017-18	48,89,000
2018-19	10,84,565
2019-20	56,35,200
2020-21	1,12,33,623
2021-22	14,22,280
2022-23	1,20,43,022
2023-24	1,12,12,292
2024-25	1,19,65,383
మొత్తం	5,97,89,365

బాధ్యతతో విధులు నిర్వహిస్తున్నాం



మార్కెట్ ఆర్థిక లావాదేవీల కోసం బాధ్యతతో విధులు నిర్వహిస్తున్నాం. లైసెన్స్‌తోపాటుగా అనుభవం ఉన్న ట్రేడర్స్‌లతో వరి, మొక్కజొన్న తదితర ధాన్యం కొనుగోలుకు కృషి చేస్తాం. అభివృద్ధి తమ బాధ్యతగా పని చేస్తున్నాం.

– నాగరాజు, మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి కార్యదర్శి

నిధుల మంజూరుకు మంత్రికి వినతి



మార్కెట్ అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నాం. నిధుల మంజూరుకు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. వ్యవసాయ మార్కెట్‌కు ధాన్యం ఆరబెట్టుటకు షెడ్డు నిర్మించాలి, సీసీ ప్లాట్ ఫారం(కల్లం)కు నిధులు అవసరం ఉన్నాయి. అలాగే సీసీ రోడ్డు, తారు రోడ్డు నిర్మాణాలకు సుమారు రూ.1.5 కోట్లు అవసరం ఉన్నాయని నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరుతాం. మార్కెట్ అభివృద్ధికి మంత్రి ప్రోత్సాహం ఉంది.

– బొయిని నిర్మల, కోహెడ ఏఎంసీ చైర్మన్

కూతురిని స్కూల్‌లో దింపేందుకు వెళ్లి

వివాహిత అదృశ్యం

వర్గల్(గజ్వేల్‌): వర్గల్ మండలం నాచారంలో వివాహిత అదృశ్యమైంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. నాచారం గ్రామానికి చెందిన ఆకుల కృష్ణవేణి(27) గత నెల 28న తన కూతురును స్కూల్‌లో దింపేందుకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. భర్త ప్రభాకర్ ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్‌లో వచ్చింది. చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లి యువతి


కృష్ణవేణి(ఫైల్‌)

పటాన్‌చెరు టౌన్: యువతి అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఎంజీ రోడ్డుకు చెందిన ధనలక్ష్మి (25) 13న తల్లి పుణ్యవతి, తండ్రి లక్ష్మీనారాయణ ఇద్దరూ పనికి వెళ్లి సాయంత్రం ఇంటికొచ్చేలోపు కనిపించలేదు. కూతురు కనబడటం లేదని పక్కింటి వాళ్లని అడుగగా ఉదయం ఇంటికి తాళం వేసి వెళ్లిందని చెప్పారు. చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కూతురి అదృశ్యంపై విజయవాడకు చెందిన వ్యక్తి పై అనుమానం ఉందని ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంద్రేశంలో వివాహిత

పటాన్‌చెరు టౌన్: డ్యూటీకని వెళ్లి వివాహిత అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కుర్షిత్ అలీ కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం సాయి కాలనీకి చెందిన సిద్దు ఓ ప్రైవేట్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నాడు. భార్య భాగ్యలక్ష్మి డివిజన్ పరిధిలోని వాల్యూ జోన్‌లో పని చేస్తుంది. 4వ తేదీన భార్యాభర్తలిద్దరూ ఉద్యోగ రీత్యా ఇంటి నుంచి బయలుదేరి వెళ్లారు. తిరిగి సాయంత్రం భాగ్యలక్ష్మి ఇంటికి రాకపోవడంతో సిద్దు వ్యాలీ జోన్ హెచ్ ఆర్ డిపార్ట్‌మెంట్ వారికి ఫోన్ చేయగా డ్యూటీ కి రాలేదని తెలిపారు. భార్య కోసం స్థానికంగా, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

అల్లాదుర్గం(మెదక్‌): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతానగర్ గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి, మృతుడి బంధువుల కథనం మేరకు.. అల్లాదుర్గం మండలం కాయిదంపల్లి గ్రామానికి చెందిన మునిరిగారి మల్లయ్య(50) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అలాగే వడ్డీకి అప్పులు ఇస్తుంటాడు. గురువారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం సీతానగర్ గ్రామానికి చెందిన విఠల్ వ్యవసాయ భూమిలో శవమై రోడ్డు పక్కన పడి ఉన్నాడు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మల్లయ్య గురువారం సాయంత్రం అల్లాదుర్గం ఐబీ చౌరస్తాలో కొంత మందితో కలిసి మద్యం సేవించినట్లు తెలిసింది. అతడి వద్ద అప్పు తీసుకున్న వారే డబ్బులు అడిగితే హత్య చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తండ్రి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ కూతురు బేతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


విచారణ జరుపుతున్న ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి

మోటార్ బాగు చేసేందుకు బావిలోకి దిగి

నీట మునిగి రైతు మృతి

హవేళిఘణాపూర్(మెదక్‌): బావిలో నీట మునిగి రైతు మృతి చెందిన ఘటన హవేళిఘణాపూర్ మండలం శమ్నాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సత్యనారాయణ కథనం మేరకు.. శమ్నాపూర్ గ్రామానికి చెందిన రైతు కుమ్మరి పోచయ్య(37) ఎకరా పొలంలో వరి సాగు చేశాడు. శుక్రవారం కుమారుడు జశ్వంత్‌తో కలిసి పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. మోటార్ ఆన్ చేయగా నీరు రాలేదు. బావిలో ఉన్న పైపులో చెత్తను తీసేందుకు అందులోకి దిగాడు. ఎంతసేపైనా బయటకు రాకపోవడంతో కుమారుడు పిలిచినా స్పందించలేదు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా గ్రామస్తులతో కలిసి అక్కడికి చేరుకొని బావిలోంచి పోచయ్య మృతదేహాన్ని వెలికితీశారు.

కుంటలో పడి వ్యక్తి..

గజ్వేల్‌రూరల్: కుంటలో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని పిడిచెడ్‌లో శుక్రవారం వెలుగు చూసింది. గజ్వేల్ పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గద్ద జయరాములు(48)కు మద్యం తాగే అలవాటు ఉండడంతో పాటు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గురువారం సాయంత్రం గ్రామ శివారులోని పోల్కమకుంటలో బహిర్భూమికి వెళ్లాడు. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కుంట వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. మరుసటి రోజు మరోసారి కుంట వద్ద పరిశీలించగా జయరాములు మృతదేహం నీళ్లలో కనిపించింది. బయటకు తీసి పోలీసులకు సమాచారం అందించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మృతదేహం లభ్యం

జిన్నారం (పటాన్‌చెరు): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన శుక్రవారం బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన గౌతమ్ గైక్వాడ్ (38) అనుమానాస్పద స్థితిలో దూబగుంట పెద్దవాగులో శవమై కనిపించాడు. గ్రామస్తులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి మృతుడి జేబులోని డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంగా మహారాష్ట్రకు చెందిన గౌతం గైక్వాడ్‌గా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు బొల్లారం పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని సీఐ రవీందర్ రెడ్డి తెలిపారు.

వేతనాలు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

జహీరాబాద్ టౌన్: పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు శుక్రవారం ఐసీడీఎస్ సీడీపీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్(సీఐటీయూ) నాయకులు, జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ... టీచర్లు, హెల్పర్ల రెండు నెలల జీతం ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. బ్యాంక్ సమస్య ఉందన్న కారణంతో జీతాలు చెల్లించకుండా జాప్యం చేయడం వల్ల వారి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు చెల్లించకపోతే హైదరాబాద్‌లోని కమిషనరేట్‌కు వెళ్లి ధర్నా చేస్తామని హెచ్చరించారు.అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగమణి, విజయలక్ష్మి, గౌరమ్మ, జగదాంబ తదితరులు పాల్గొన్నారు.

ఒకే నంబర్ ప్లేట్‌తో మూడు బైక్‌లు

- నకిలీ వాహనాలపై రూ.4,500 చలాన్లు
- అసలు నంబర్ గల వాహనదారుడిని చెల్లించాలనడంతో వెలుగులోకి


యాక్టీవాతో యజమాని ప్రభాకర్‌గుప్తా

శివ్వంపేట(నర్సాపూర్‌) : ఒకే నంబరు ప్లేట్ పై మూడు బైక్‌లు రోడ్డుపై సంచరిస్తూ ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించడంతో పోలీసులు చలాన్లు విధించారు. కొద్దిరోజులకు అసలైన బైక్ యజమాని రోడ్డు పైకి రాగా పోలీసులు చలాన్లు కట్టాలనడంతో అవాక్కయ్యాడు. ఈ విచిత్రకర ఘటన మండల కేంద్రమైన శివ్వంపేటలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. శివ్వంపేటకు చెందిన గుండం ప్రభాకర్‌గుప్తాకు హోండా యాక్టీవా స్కూటీ (గోల్డ్ కలర్)ని 2018లో కొనుగోలు చేసి టీఎస్35బీ 3539 నంబర్‌తో రిజిస్ట్రేషన్ పొందాడు. రెండు రోజుల కిందట ప్రభాకర్ గుప్తా యాక్టీవా పై హైదరాబాద్ వెళ్లాడు. అక్కడి ట్రాఫిక్ పోలీసులు ఆపి పెండింగ్ చలాన్ చెల్లించాలని చెప్పారు. 7 చలాన్‌కు సంబంధించి రూ.4,500 చెప్పారు. అందుకు సంబంధించి వివరాలు చూస్తే చలాన్ విధించిన యాక్టీవాలు ఒకే నంబర్‌తో ఉండగా కలర్ మాత్రం వేరేగా ఉన్నాయి. ఇది ఇతరులకు సంబంధించిన వాహనం అని నాది కాదని చలాన్ ఎలా చెల్లిస్తానని పోలీసులతో వాగ్వాదం చేయడంతో వదిలేశారు. తనకు కేటాయించిన రిజిస్ట్రేషన్ నంబరు ఇతర వ్యక్తులు ఎలా ఉపయోగిస్తున్నారని ఏదైనా ఘటన జరిగితే బాధ్యులు ఎవరని ప్రభాకర్ గుప్తా ప్రశ్నించారు. ఈ విషయం పై సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి నకిలీ నంబర్ ప్లేట్ పై సంచరిస్తున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు.


వేరే రంగు గల యాక్టీవాలకు ఒకే నంబర్

నెత్తురోడిన రహదారులు

- వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి
- మరో ఐదుగురికి తీవ్ర గాయాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

బైక్‌ను ఆటో ఢీకొని ఇద్దరు సీఆర్పీలు..


రమేశ్‌(ఫైల్‌)


శ్రీనివాస్‌(ఫైల్‌)

చేగుంట(తూప్రాన్‌): రోడ్డు ప్రమాదంలో విద్యాశాఖలో పని చేస్తున్న సీఆర్పీలు మృతి చెందారు. ఈ ఘటన మండలంలోని మక్కరాజీపేట రోడ్డులో బిషప్ గెస్ట్‌హౌస్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని గొల్లపల్లి జైత్రం తండాకు చెందిన రమేశ్(35), చందాయిపేటకు చెందిన ఎర్ర శ్రీనివాస్(40) ఎంఈఓ కార్యాలయంలో మక్కరాజీపేట కాంప్లెక్స్ పాఠశాలలో సీఆర్పీలుగా పని చేస్తున్నారు. వీరిద్దరూ మక్కరాజీపేటలో విధులు ముగించుకొని మండల కార్యాలయానికి బైక్‌పై వస్తున్నారు. బిషప్ గెస్ట్‌హౌస్ సమీపంలోని మలుపు వద్ద చేగుంట వైపు నుంచి వస్తున్న ట్రాలీ ఆటో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా రమేశ్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. శ్రీనివాస్‌ను గజ్వేల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి, రామాయంపేట సీఐ వెంకట్‌రాజాగౌడ్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. ఉద్యోగులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై ఎంఈఓ నీరజతోపాటు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు బైకులు ఢీకొని యువకుడు


అభిషేక్ (ఫైల్‌)

బెజ్జంకి(సిద్దిపేట): రెండు బైక్‌లు ఢీకొని యువకుడు మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండలంలోని రేగులపల్లె స్టేజీ వద్ద గల రాజీవ్ రహదారి పై శుక్రవారం చోటు చేసుకుంది. బెజ్జంకి ఎస్ఐ క్రిష్ణారెడ్డి కథనం మేరకు.. కరీంనగర్ జిల్లా మానకొండూర్‌కు చెందిన శానగొండ భానుప్రసాద్ అతడి బంధువు అభిషేక్ (23)తో కలిసి పని నిమిత్తం బైక్‌పై రేగులపల్లెకు వచ్చారు. తిరిగి కరీంనగర్ వైపునకు రాజీవ్ రహదరి పై యూటర్న్ తీసుకుంటుండగా సిద్దిపేట నుంచి కరీంనగర్ వైపునకు వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.108 అంబులెన్సులో భానుప్రసాద్, అభిషేక్‌ను సిద్దిపేట ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అభిషేక్ మృతి చెందాడు. మరో బైక్‌పై ఉన్న అభినయ్‌తోపాటు మరో యువకుడికి గాయాలు కాగా కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు అభిషేక్ తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్ ఢీకొని వ్యక్తి

తొగుట(దుబ్బాక): బైక్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఘనపూర్ శివారులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. తొగుట ఎస్ఐ రవికాంత్‌రావు కథనం మేరకు.. తుక్కాపూర్ గ్రామానికి చెందిన దొంతి యాదగిరి (34) ఘనపూర్ నుంచి రాత్రి 9 గంట ప్రాంతంలో తుక్కాపూర్‌కు కాలినడకన వస్తున్నాడు. ఇదే సమయంలో ఘనపూర్‌కు చెందిన శివంది ప్రశాంత్ బైక్‌పై అతివేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో యాదగిరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం వెంటనే సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. యాదగిరి తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోవడంతో మేనత్త చిక్కుడు లక్ష్మీ వద్ద ఉంటున్నాడు. మృతుడి మేనత్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్‌ను ఢీకొన్న లారీ


గజ్వేల్‌రూరల్: బైక్‌ను లారీ ఢీకొట్టడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని బెజుగామకు చెందిన రొయ్యల నర్సింలు శుక్రవారం బైక్‌పై ప్రజ్ఞాపూర్ నుంచి వచ్చి పట్టణంలోని స్వామి వివేకానంద చౌరస్తా వద్ద పిడిచెడ్ రోడ్డు వైపు మలుపు తిరుగుతున్నాడు. ఇదే క్రమంలో ప్రజ్ఞాపూర్ నుంచి తూప్రాన్ రోడ్డు వైపు వెళ్తున్న కంటైనర్ లారీ నర్సింలు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో నర్సింలు కాలు విరగడంతో స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఓఆర్ఆర్‌పై ట్రాలీ ఆటోను ఢీకొట్టిన కారు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

పటాన్‌చెరు టౌన్: ట్రాలీ ఆటోను ఢీకొట్టిన కారు ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ స్వామిగౌడ్ కథనం మేరకు.. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాటి గ్రామ శివారులోని ఓఆర్ఆర్ పై శుక్రవారం వెళ్తున్న ట్రాలీ ఆటో టైర్ పంచర్ అయింది. డ్రైవర్ వాహనాన్ని పక్కకు తీస్తుండగా అదే సమయంలో గచ్చిబౌలి నుంచి ముత్తంగి వైపు వస్తున్న బీఎండబ్ల్యూ కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ యాష్‌కు తీవ్ర గాయాలు కాగా కారు నుజ్జునుజ్జయ్యింది. కారులో ఇరుక్కుపోగా అటుగా వెళ్తున్న వాహనదారులు చూసి యాష్‌ను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు బీడీఎల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి మరో యువకుడు


రవి మృతదేహం

చేగుంట(తూప్రాన్‌): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన మాసాయిపేట శివారులోని బంగారమ్మ ఆలయ సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. దౌల్తాబాద్ మండలం ఇందుర్‌ప్రియాల్ గ్రామానికి చెందిన రవి(29), శివకుమార్ బైక్‌పై చేగుంట వైపు నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్నారు. ఈక్రమంలో బైక్ అదుపుతప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలై రవి అక్కడికక్కడే మృతి చెందాడు. స్వల్ప గాయాలైన శివకుమార్‌ను చికిత్స నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువులకు సమాచారం అందించి కేసు నమోదు చేసి మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.